www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 9 ఫిబ్రవరి 2024

## స్విమ్స్ వైరాలజీ విభాగంలో దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాశక్తి - తిరుపతి సిటి**

స్విమ్స్ యూనివర్సిటీ క్లినికల్ వైరాలజీ విభాగంలో వివిధ కాంట్రాక్టు పోస్టుల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతిన మూడు పోస్టులున్నాయి. సైంటిస్ట్ –సి, సైంటిస్ట్ –బి, ప్రాజెక్టు రీసెర్చి అసిస్టెంట్ పోస్టు 1 కోసం దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు పూర్తి చేసి, అవసరమైన అన్ని సర్టిఫికేట్లు జిరాక్స్ జత చేసి 12వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూకు రావలని కోరారు. సంబంధిత కాంట్రాక్టు పోస్టుల నియామకం 12నెలల వరకు ఉంటుంది. అవసరాన్ని బట్టి పొడిగిస్తారు.

జేసీబీతో దారి మూసేసే ప్రయత్నం చేయగా అడ్డుకున్న పేదలు

### ప్రభుత్వ భూముల్లో రాజకీయ రాబంధులు

# పేదలపైనే 'రెవెన్యూ' ప్రతాపం

- వేలాది ఎకరాల్లో కబ్జారాయుళ్ల తిష్ట
- పట్టించుకోని ప్రభుత్వ అధికారులు
- పేదలపై కక్షసాధింపు చర్యలు

**ప్రజాశక్తి - తిరుపతి**

కాయకష్టం చేసుకుని బతుకుతున్న నిరుపేదలు రెండు సెంట్లు ఇంటి స్థలం అడిగితే భూములే లేవంటూ రెవెన్యూ అధికారులు బుకాయిస్తున్నారు. అయితే ఒక్క కరకంబాడి ప్రాంతంలోనే వేలాది ఎకరాల ప్రభుత్వ భూముల వివరాలను ప్రజా సంఘాల నేతలు వెలుగులోకి తీసుకురావడంతో అధికారులే విస్తుపోతున్నారు. ఆ భూములు ఎవరికిచ్చారో లెక్క తేల్చాలని పట్టుబడుతుండటంతో అధికార యంత్రాంగం నోరు మెదపలేక కనుగుడ్లు తేలేస్తున్నారు. ఎందుకంటే ఆ భూముల్లో ఇప్పటికే రాజకీయ రాబందులు పెద్ద ఎత్తున పాగా వేసేశారు.

**ఒక్క కరకంబాడిలోనే వేల ఎకరాలు!**

రేణిగుంట మండల పరిధిలోని ఒక్క కనకంబాడి రెవెన్యూ పరిధిలోనే వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు ప్రజా సంఘాల నేతలు సర్వే నెంబర్లతో సహా వెలుగులోకి తెచ్చారు. ఈ భూములను ఎవరికి కట్టబెట్టారో లెక్క చెప్పాలంటూ కలెక్టర్ లక్ష్మీ షాను నిలదీశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన ఈ భూములపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తానటూ హామీ ఇవ్వడం గమనార్హం.

**వెలుగులోకి వచ్చిన ప్రభుత్వ భూములివే..**

| సర్వేనం | ఎకరాలు |
|---|---|
| 1 | - 7529.41-అడవి |
| 153/1 | - 125.65-అడవి |
| 74 | - 3485.16 |
| 340/1 | - 2.15 |
| 666/2 | - 2.72 |
| 714 | -123.7 |

**అనాదీన భూములు ఏమయ్యాయో**

APEDC...705/1 -198.00 ప్రభుత్వ భూమి ఎవరికి కట్టబెట్టారో తెలియదు

**పశువుల బైలు కోసం**

| | |
|---|---|
| 100 | -1.13 సెంట్లు |
| 234 | - 8.98 |
| 241/2 | -1.93 సెంట్లు |
| 621/9 | -3.42 సెంట్లు |
| 622/1 | - 9.58 సెంట్లు |
| 73/2 | - 3.47 సెంట్లు |

ఈ భూముల పరిస్థితి ఏంటని నిలదీస్తే రెవెన్యూ నుంచి సమాధానమే లేదు.

**నివాస గృహాలకు**

| | |
|---|---|
| 140/1 | -11.22 సెంట్లు |
| 140/2 | - 2.93 సెంట్లు |
| 746/1 | -9.96 సెంట్లు |

కేటాయించినప్పటికీ ఈ భూములను ఎవరికిచ్చారు అని ప్రశ్నిస్తే కళ్లు తేలేస్తున్నారు.

### జానెడు గుడిసెకు స్థలం ఇవ్వలేరా

**జున్ను, భవన నిర్మాణ కార్మికురాలు**

నేను 18 సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికురాలుగా పనిచేస్తున్నాను. రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు మావి. కాయ కష్టం చేస్తే వచ్చే నాలుగు డబ్బులు మాకు తినడానికే సరిపోవడం లేదు. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నారే కానీ మా గుడిసెకు మాత్రం జానెడు స్థలం ఇవ్వలేదు. అందుకే ఎర్రజెండా నీడన గుడిసె వేసుకున్నాం. అయితే తొలగించేందుకు అధికారులు కుట్రలు చేయడం దారుణం.

### పేదలు సరే ...పెద్దోళ్ల సంగతి ఏంటి? : మోదీన్

ప్రభుత్వ కొండ స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదలని ఇబ్బందులు పాలు చేస్తున్నారు సరే... మరి వేలాది ఎకరాలను తమ కబంధహస్తాల్లో ఉంచుకున్న పెద్దోళ్ల సంగతి ఏంటో నిగ్గు తేల్చాలి. వందల వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు దర్జాగా కబ్జా చేస్తున్నా నోరు మెదపని ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్లు పేదల పైన కర్రపెత్తనం చేస్తుంటే ఊరుకోబోము. మాకు అండగా ఎర్రజెండా ఉంది. తాడో పేడో తేల్చుకుంటాం. వెనకడుగు వేసే ప్రసక్తే లేదు.

## జెసిబితో దారి మూసేందుకు విఫలయత్నం


ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు పన్నినా స్థలం ఖాళీ చేసేది లేదంటున్న పేదలు

కరకంబాడి లో పేదలు వేసుకున్న గుడిసెలకు వెళ్లే దారిని జెసిబి తో పూడ్చి చేసేందుకు రెవెన్యూ అధికారులు గురువారం సాయంత్రం విఫల యత్నం చేశారు. అయితే వందలాది మంది పేదలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని జెసిబిని అడ్డుపడ్డారు. తమ పట్ల ఎన్ని నిర్బంధాలను ప్రయోగించినా తాము ఇక్కడి నుంచి వెళ్లబోయేది లేదంటూ పేదల ఇళ్ల స్థలాల సాధన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సత్యశ్రీ ,రాజశేఖర్ ఈ సందర్భంగా ప్రకటించారు. ఇక్కడున్న పేదలందరికీ న్యాయం జరిగేంత వరకు వెనుకంజ వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అధికారులకు చేతనైతే ఇక్కడే ప్రభుత్వ స్థలంలో పాగావేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న సిద్దుల రవి స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని సవాలు విసిరారు. పేదలంటే అటు ప్రభుత్వానికి, ఇటు అధికారులకి లోకువయ్యారని, అందుకే ఇలా పేదలపై బల ప్రయోగాలకు సిద్ధమవుతున్నారని విమర్శించారు.

### ఖాళీ చేసే ప్రసక్తే లేదు: మాయ

మేం వేసుకున్న గుడిసెలకు రాత్రింబవళ్లు కాపలాగా ఉంటున్నాము. మాకు న్యాయం చేసి ఇంటి స్థలం ఇవ్వనిదే ఇక్కడి నుంచి ఖాళీ చేసే ప్రసక్తే లేదు. అధికారులే కాదు రౌడీలు రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున కుయుక్తులు పన్ని పేదల గుడిసెల్ని తొలగించాలని పరితపిస్తున్నారు. ఎవరొచ్చినా మేమంతా సంఘటితంగా ఎదుర్కొంటాం.

## విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్**

విద్యుత్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం తిరుపతిలోని పద్మావతి పురంలో ఉన్నటువంటి ఎస్సీ ఆఫీస్ ముందు విద్యుత్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు .గడిచిన నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలలుగా కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ కార్మికుల , ఉద్యోగుల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లు తయారయ్యింది. జగన్మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వస్తే రెగ్యులర్ చేస్తానని అప్పటి ప్రతిపక్ష నాయకుడిగా హామీ ఇచ్చిన మాటను నమ్మి కార్మికులందరూ గంపగుత్తగా ఓట్లు వేశారని, తీరా అధికారంలోకి వచ్చిన దాదాపు ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా నేటికీ వీరి సమస్యలు పరిష్కరించ లేదంటే ఇంతకంటే దుర్మార్గం ఇంకొకటి ఉండదని అన్నారు.

కార్మికులందరినీ తక్షణం రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలను నేరుగా కార్మికులకే అందించాలని, 2022 వేతనాల అరియర్స్ చెల్లించాలని, మరణించిన కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు కారుణ్య నియామకాలను పూర్తి చేయాలని వినతిపత్రం అందజేశారు. సమస్యపై స్పందించిన అధికారి తమ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కారిస్తానని అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ డిస్కం సెక్రటరీ శివప్రసాద్ రెడ్డి, స్టేట్ జాయింట్ సెక్రెటరీ టి కుమార్, జిల్లా నాయకులు రవి నారాయణ, సోము, మురళి ,గజ ,ప్రసాద్ ,కాదిర్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టు ఉత్పత్తికి రెయిన్బో అగ్రోవెట్‌తో ఒప్పందం

**ప్రజాశక్తి - క్యాంపస్**

పట్టు రైతుల ఉత్పాదకతను పెంపొందించే ఉత్పత్తులను ఆవిష్కరించే నిమిత్తమై శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, రెయిన్బో అగ్రోవెట్ సెరీ టెక్ ప్రైవేట్ లిమిటెడ్‌తో గురువారం ఒప్పందం కుదుర్చుకుంది. విసి ఆచార్య డి. భారతి మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా బయోసైన్స్ అండ్ సెరికల్చర్ విభాగంలో విస్తృత పరిశోధనలు గావించి, ఇండస్ట్రీ ద్వారా ఆ ఫలితాలు క్షేత్రస్థాయికి చేరేలా చేయడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దీనిద్వారా రీసెర్చ్ స్కాలర్స్ కి సామాజిక అవసరాలకు అనుగుణంగా అధ్యయనాలు చేపట్టే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, రెయిన్బో ఆగ్రోవేట్ సెరీ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బీవీ. సుబ్బారాయుడు, స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సుజాత, సెరికల్చర్ విభాగాధిపతి ప్రొఫెసర్ మమత, ప్రో.సావిత్రి, ప్రో.విజయకుమారి పాల్గొన్నారు.

### స్విమ్స్‌కు రూ.10 లక్షల విరాళం

**తిరుపతి సిటి:** స్విమ్స్ శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి రూ.10,01,000 లను చెన్నయ్‌కి చెందిన సిఎంజి స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు అందజేశరని ఉపకులపతి ఆర్‌వి కుమార్ తెలిపారు. శ్రీవారిపై ఉన్న భక్తి విశ్వాసంతో ఈ విరాళాన్ని అందజేసినట్లు తిరుపతికి చెందిన కంపెనీ ప్రతినిధి వై.రాఘువేంద్ర తెలిపారు.

### భూసేకరణ వేగవంతం చేయండి : కలెక్టర్

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రవాణా, రహదారులు అండ్ భవనాల సెక్రటరీ ప్రద్యుమ్న అమరావతి నుండి గురువారం వర్చువల్ విధానంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న జాతీయ రహదారులకోసం అవసరమయ్యే ప్రభుత్వ భూములు, డికేటి భూములు, పట్టా భూములు అవసరం మేరకు విస్తీర్ణాన్ని సేకరించాలని సూచించారు. కలెక్టర్ డా.జి. లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలోని ఆరు ఎన్ హెచ్ ఏ ఐ ప్రాజెక్టులకు భూసేకరణ వివిధ స్టేజిలలో ఉన్నదని, అవార్డ్ పాస్ చేయడం, కాంపెన్సేషన్ అందజేయడం తదితర అంశాలు వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ వర్చువల్ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డికే శుభం బన్సల్ పాల్గొన్నారు.

### కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్టీసీ డిటీఓ

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ**

జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీ షాను ఏపీఎస్ఆర్టీసీ కి చెందిన జిల్లా ప్రజా రవాణా అధికారి టీ. చెంగల్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్లోనీ జిల్లా పాలన అధికారి చాంబర్లో పుష్పగుచ్చం అందించి, దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిటిఎం భాస్కర్ ఉన్నారు.

### పూర్వ ప్రాథమిక విద్యపై కళాజాత

**ప్రజాశక్తి -ఏర్పేడు**

ప్రగతి సంస్థ, తిరుపతి వారి ఆధ్వర్యంలో ఏర్పేడు మండలంలోని చిందేపల్లి, కొత్త వీరాపురం, వెంకటాపాలెం, బండారుపల్లి గ్రామాలలోని ప్రజలకు పూర్వ ప్రాథమిక విద్యపై కళాజాతాను నాగేశ్వరరావు కళాబందం నిర్వహించింది. ఈ బందం వారు పాటలు, నాటికలు ద్వారా ప్రజలకు, గర్భిణీలకు, బాలింతలకు, ఆరు సంవత్సరాల లోపు పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు, అంగన్వాడి సెంటర్ల యొక్క ఉపయోగాలు, సేవలు, పోషకాహారాలు తదితర అంశాలపై అవగాహన కల్పించరు. ప్రగతి సిబ్బంది మాట్లాడుతూ క్రై, సన్ టీవీ సహకారంతో రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లోని 12 అంగన్వాడి సెంటర్లకు మౌలిక వసతులు కల్పించామన్నారు. ప్రజలలో అవగాహన పెంపొందించడానికి కళ జాత కార్యక్రమాలు ఈ 12 గ్రామాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రగతి సిబ్బంది మండల కోఆర్డినేటర్ గుండ్లపల్లి శిరీష, వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.

## మెటీరియల్ సైన్స్‌లో నూతన ఆవిష్కరణలు

**ప్రజాశక్తి - క్యాంపస్**

మెటీరియల్ సైన్స్ లో నూతన ఆవిష్కరణల కోసం విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు అత్యాధునికమైన పరికరాల ప్రయోగాల ఆవశ్యకత ఎంతైనా ఉందని రిజిస్ట్రార్ ఆచార్య ఓయండి . హుస్సేన్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని జంతుశాస్త్ర విభాగం, ఐజర్ ల సంయుక్త ఆధ్వర్యంలో డిఎస్టి – సెర్బ్ ఎస్ఎస్ఆర్ ప్రోగ్రాం " నేషనల్ వర్క్ షాప్ ఆన్ న్యూ హొరిజన్స్ ఆఫ్ ఫ్లోరోసెన్స్ మైక్రోస్కోపీ టెక్నిక్ " అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్ షాప్ గురువారం ఎస్వీయూ సెనేట్ హాల్లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎస్వీయూ రిజిస్ట్రార్ ఓఎమ్డి హుస్సేన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఫ్లోరోసెన్స్ మైక్రోస్కోపీ టెక్నిక్ గురించి విద్యార్థులకు పరిశోధకులకు అవగాహన కల్పించే ఈ జాతీయ స్థాయి వర్క్ షాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తిరుపతిలోని ఐజర్ కు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రామ్ కుమార్ మాట్లాడుతూ వర్క్ షాప్ లోని ఫ్లోరోసెన్స్ మైక్రోస్కోపీ టెక్నిక్స్ యొక్క అభివద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్వియు సైన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ఆచార్య కేటి రామకష్ణారెడ్డి, వర్క్ షాప్ కన్వీనర్ ఆచార్య యం. రాజశేఖర్, ఆచార్య కిషోర్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

### రైల్వే కార్మికుల తాగునీటి సమస్య పరిష్కరిస్తా :డిప్యూటీ మేయర్

**ప్రజాశక్తి -రేణిగుంట**

రైల్వే కార్మికులకు తాగునీటి సమస్య పరిష్కరిస్తానని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. సిఆర్ఎస్ కార్మికుల ఆత్మీయ సమవేశం గురువారం జరిగింది. అభినయ్ రెడ్డి మాట్లాడుతూ రైల్వే కార్మికుల నీటి సమస్య రైల్వే చీఫ్ వర్కుషాపు మేనేజర్ దేవసహాయం అభ్యర్థన మేరకు సమావేశానికి హాజరయ్యారు. కార్పొరేషన్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. అలాగే శెట్టిపల్లి గ్రామానికి ఎప్పటినుంచో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి రైల్వే గేట్ సమస్యను ఎంపీ గురుమూర్తి దష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ లీడర్స్ మజ్దూర్ యూనియన్ సెక్రటరీ సురేందర్ రెడ్డి, కే బాబు, సంగ్ యూనియన్ సెక్రటరీ మునయ్య , వైసిపి శెట్టిపల్లి లీడర్లు ఉపసర్పంచ్ కే రామకష్ణ, బత్తెన బాబు, బాలమురళీకష్ణ, ధనుంజయులు పాల్గొన్నారు.

### సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

బుధవారం సీఏ ఇన్స్ టిట్యూట్ విడుదల చేసిన ఫలితాల్లో తిరుపతి నగర పరిధిలోని ఎమరాల్డ్స్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్లు విద్యాసంస్థల డైరెక్టర్లు ఇ.గిరిధర్, కె.విశ్వనాథ్ ప్రకటించారు. ఈ ఫలితాల్లో 56.34 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరి లో ఆర్. సత్యా 314, ఎం. లావణ్య 265, కె. శ్రీయ 259, ఆర్. యశ్వంత్ 257, దివాకర్ రెడ్డి 256 మార్కులతో టాపర్లుగా నిలిచారన్నారు. ఈ అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను, అధ్యాపక బంధాన్ని ఈ సందర్భంగా డైరెక్టర్లు ప్రత్యేకంగా అభినందించారు. ఈ అభినందన కార్యక్రమంలో ఎమరాల్డ్స్ విద్యాసంస్థల ఉపసంచాలకులు మునిరత్నం, నాథముని, జానీ, శ్రీను పాల్గొన్నారు.

### జగన్‌కు వ్యక్తిగత ఆదాయంపైనే శ్రద్ధ : నరసింహా యాదవ్

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ఆదాయంపై దష్టి పెట్టలేదని తన వ్యక్తిగత ఆదాయంపై దష్టి ఉంచారన్న విషయం రాష్ట్ర బడ్జెట్ ను చూస్తే తేటతెల్లం అవుతుందని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశల వారీగా మద్యపాన నిషేధాన్ని చేస్తానని చెప్పిన సీఎం జగన్ నాసి రకం మద్యాన్ని అధిక ధరలకు విక్రయించి సామాన్య మధ్యతరగతి ప్రజలు మృత్యువాత పడేవిధంగా చేశారన్నారు. అధికారంలోకి వస్తే ఒక్కసారి కూడా విద్యుత్ చార్జీలు పెంచబోనని చెప్పిన పెద్ద మనిషి తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. దీంతో సామాన్యులు ఆందోళన చెందే పరిస్థితి నెలకొందన్నారు. నివాసయోగ్యం ఉన్న చోట్ల పట్టాలు ఇస్తానని ఆ మాట తప్పారాన్నారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన జగన్ కు ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో మునికష్ణ, శ్రీధర్ వర్మ పాల్గొన్నారు.

## కనీస వేతనమివ్వకుంటే సమ్మెలోకి..

**ప్రజాశక్తి - క్యాంపస్**

తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ కళాశాల కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 16వ తేదీ పైన ఎప్పుడైనా రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్టు గండికోట నాగ వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ కళాశాల కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం స్థానిక వ్యవసాయ కళాశాల ఆవరణలో జరిగింది ఈ సందర్భంగా ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గండికోట నాగవెంకటేష్ మాట్లాడుతు గత 22 సంవత్సరాల నుండి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకి కనీసవేతనాలు అమలు చేయాలని, ప్రతి నెల జీతాలు ఇవ్వాలని, టైంస్కేలు అమలు చేయాలని, ఈఎస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా ఐదు లక్షల రూపాయలు, ప్రసూతి సెలవులు, ప్రభుత్వ సెలవులు అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె లోకి వెళ్తున్నట్టు తెలిపారు. అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి రాకేష్, సిఐటియు నాయకులు ముకేష్, నాయకులు చంద్రమ్మ, రమా, అనురాధ పాల్గొన్నారు.

### తిరుపతి కేంద్రంగా టూరిజం అభివృద్ధి

**తిరుపతి టౌన్ :** ప్రపంచ పర్యాటక కేంద్రంగా తిరుపతి మారడానికి గల సాధ్యాసాధ్యాలను, దాని ఆవశ్యకతను తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రత్యేక ప్రస్తావన (377) ద్వారా కేంద్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లారు. శ్రీహరికోట సతీష్ ధావన్ రాకెట్ లాంచ్ సెంటర్, జీవవైవిధ్యం అధికంగా ఉండే పులికాట్ సరస్సు, ప్రఖ్యాత వైద్య శాస్త్రీయ సంస్థలకు నిలయమని తెలిపారు. ఈ వనరులను సద్వినియోగపరచి తిరుపతి జిల్లాను పర్యాటక కేంద్రంగా అభివద్ధి చేసుకొనేందుకు సహకార కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర పర్యాటక శాఖా మంత్రిని అభ్యర్థించారు.

## 'ఆర్‌సి పురం' అంటేనే 'టెర్రర్'

- ఎస్ఐగా వచ్చేందుకు అనాసక్తి
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలిక్కడే ఎక్కువ
- పోలీసు స్టేషన్‌లో 12మంది సిబ్బంది కొరత

**ప్రజాశక్తి - రామచంద్రాపురం**

తిరుపతి జిల్లా రామచంద్రాపురం రక్షక భట నిలయానికి ఎస్ఐ నియామకం జరిగేనా? అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇక్కడ ఎస్‌హెచ్‌ఒగా విధులు నిర్వహిస్తున్న ఎస్.గిరిబాబు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అనంతపురానికి బదిలీ అయ్యారు. జనవరి 30న గిరిబాబు రిలీవ్ అయ్యారు. అయితే ఇక్కడకు ఎస్ఐగా రావడానికి ఎవరూ సుముఖత చూపడం లేదని సమాచారం. దీంతో తిరుచానూరు పోలీసు స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ చిరంజీవి ఇన్‌ఛార్జి ఎస్. హెచ్‌ఒగా వ్యవహరిస్తున్నారు.

రానున్నది ఎన్నికల వేళ.. నేడో,రేపో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. అత్యధిక సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న ఆర్‌సి పురం మండలానికి పోలీసు ఉన్నతాధికారులు ఎస్ఐను నియమించకపోవడంలో ఆంతర్యం ఏంటన్నది అంతుచిక్కని ప్రశ్న. సాధారణంగా ఎన్నికల నగారా మోగక ముందే ఎస్ఐను నియమిస్తే ముందుగానే అసాంఘిక శక్తులను పసిగట్టి పరిస్థితులను అదుపు చేసుకోవచ్చు. అలాకాకుండా ఆలస్యంగా నియామకం చేస్తే



మండల పరిస్థితులను అవగాహన చేసుకోవడం కష్టతరమవుతుంది. ఎన్నికల సమయంలో సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాల్లో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడే పరిస్థితి ఉంది.

2019 సాధారణ ఎన్నికల సమయంలో ఆర్‌సిపురం స్టేషన్లోనే అత్యధిక కేసులు నమోదయ్యాయి. ఆరు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించారు. అప్పటి అర్బన్ జిల్లా ఎస్‌పి అన్బురాజన్, అడిషనల్ ఎస్‌పి అనీల్‌బబు స్వయంగా భారీ పోలీసు బందోబస్తుతో రామచంద్రపురం మండలంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాజకీయ వర్గాల మధ్య ఏర్పడిన ఘర్షణలు, అవాంఛనీయ సంఘటనలు అదుపు చేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆర్‌సి పురానికి సమర్ధవంతమైన, నిష్పక్షపాతంగ విధులు నిర్వహించే ఎస్ఐను నియమించల్సి ఉంది.

ఆర్‌సి పురం పోలీసు స్టేషన్లో ఎస్ఐతో పాటు 28 మది సిబ్బంది ఉండాల్సి ఉంది. కానీ పోలీసు స్టేషన్లో కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఎఎస్ఐ, ఎస్ఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం స్టేషన్లో 16 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. సి.రామాపురం,నడవలూరు, నెన్నూరు, [illegible], కుప్పంబాదూరు,చిట్టత్తూరు, కాలేపల్లి, వెంకట్రామాపురం, ఎన్ఆర్ కమ్మపల్లి, నూతుగుంటపల్లి, అనుప్పల్లి పోలింగ్‌కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నాయి. ముందస్తుగా రౌడీషీటర్లను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, బైండోవర్ కేసులు నమోదు చేయల్సి ఉంది. ఇకనైన ఉన్నతాధికారులు ఆర్‌సి పురంలో ఎస్ఐతో పాటు, సిబ్బంది కొరతను తీర్చాల్సి ఉంది.

### 14 నుంచి నర్సింగ్ విద్యార్థులకు శిక్షణ

**ప్రజాశక్తి-తిరుపతి సిటీ:** విదేశీ ఉపాధి కల్పన కోసం నర్సింగ్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు దివిప్ తెలిపారు. స్థానిక న్యూ బాలాజీ కాలనీలోని గో జర్మనీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జర్మనీలో నర్సింగ్ ఉపాధి కల్పన కోసం ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ఫైనలియర్ ఏఎన్ఎం, జీఎన్ఎమ్, బీఎస్సీ, ఎంఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు సాయంత్రం నాలుగు నుంచి ఎనిమిది గంటల వరకు, నర్సింగ్ డిగ్రీ పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. జర్మనీ లాంగ్వేజ్ పై శిక్షణ అనంతరం వారికి ప్లేస్మెంట్లు కూడా కల్పించబడతాయని వెల్లడించారు. వివరాలకు 9505353545 నెంబర్ను సంప్రదించాలన్నారు.

### మసీదుల్లో వసతులు కల్పించేందుకు కృషి

**ప్రజాశక్తి-కోట:** మసీదుల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తిరుపతి జిల్లా వక్ఫ్బోర్డు ఇన్స్పెక్టర్ అలీభాయ్ అన్నారు. మండలంలోని శ్యామసుందరపురంలో ముత్యాలపేట కమిటీ సమావేశాన్ని గురువారం కమిటీ ఛైర్మన్ షేక్ మొబీన్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. డివిజన్ పరిధిలోని 82మసీదుల్లో నెలకొన్న సమస్యలను ముత్యాలపేట అలీభాయ్ దృష్టి తీసుకొచ్చారు. వీటిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అలీభాయ్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ వైస్ ఛైర్మన్ రహీం, జాయింట్ సెక్రెటరీ అమీర్, మస్తాన్ బాషా, రియాజ్, మౌలా, నజీర్, అమీరుద్దీన్,ఇస్మాయిల్ పాల్గొన్నారు.

### 'నులిపురుగులను నులిమేయాలి'

**ప్రజాశక్తి-కేవిబి పురం:** ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ నులిపురుగులను నులిమేయాలని వైద్యాధికారి కటారి కుమార్ అన్నారు. వార్మింగ్ డే పురస్కరించుకొని గురువారం స్థానిక ఆసుపత్రిలో గోడపత్రికలను ఆవిష్కరించారు. డాక్టర్ కుమార్ మాట్లాడుతూ 19 సంవత్సరాలు లోపు ఉన్న వారందరూ నులిపురుగుల నిర్మూలన మాత్రలను వాడాలన్నారు. అన్ని పాఠశాలలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు చెప్పారు. మూడు నెలలు పూర్తైన గర్భవతులు ఈ మాత్రలను వేసుకోవాలని సూచించారు. నేడు మండల కేంద్రంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

### విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

**ప్రజాశక్తి-చిల్లకూరు:** మండలంలోని పారిచర్లపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు రాజనేని రామానాయుడు ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం స్నాక్స్ అందజేశారు. ట్రస్ట్ ఫౌండర్ మాట్లాడుతూ 2018 నుంచి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. తొలుతగా ఒక్క పాఠశాలలో ప్రారంభించి ప్రస్తుతం అన్ని పాఠశాలలకు స్నాక్స్ అందజేస్తున్నట్లు వివరించారు. పది ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.లక్ష బహుమానంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన సేవలపై పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. డిప్యూటీ డీఈవో విష్ణుప్రసాద్, ఎంఈవో-2 రావు, హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు జయరెడ్డి పాల్గొన్నారు.

### సీఎం జగన్తోనే రాష్ట్రాభివృద్ధి: సర్పంచ్

**ప్రజాశక్తి-రేణిగుంట:** సీఎం జగన్తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మీశతిరెడ్డి అన్నారు. గురువారం గ్రామంలో నిర్మించిన హెల్త్ క్లినిక్, ఆర్బీకేలను రాయలచెరువు పార్కు కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఆర్ది సుబ్రమణ్యంరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ప్రజాపాలన పట్ల కొనియాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి చక్ర ప్రకాష్రెడ్డి, ఈఓపీఆర్డీ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

### అట్టహాసంగా శ్రీ చైతన్యలో స్పోర్ట్స్ మీట్

**ప్రజాశక్తి-కోట:** మండలంలోని శ్రీ చైతన్య స్కూల్లో విద్యార్థులకు స్పోర్ట్స్మీట్ వేడుకలు గురువారం అట్టహాసంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా ప్రిన్సిపాల్ ఎమ్.వెంకటయ్య, జోనల్ ఫిజికల్ డైరెక్టర్ రాఘవ్ పాల్గొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని గెలుపు ఓటమి అనుభవాలను కలిగిస్తూ పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని సూచించారు. ఆటవిధంగా శారీరక ఆరోగ్యం, చదువుకూడా కలిగి నిరంతరం చైతన్యవంతంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తి కలిగివుండాలని ఇన్ఛార్జులు హరిత, వివిధ ఉపాధ్యాయుల బృందం తెలియజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన మార్చ్ పాస్ట్ (కవాతు), సాంస్కృతిక ప్రదర్శన ఎంతగానో అలరించాయి. తదుపరి క్రీడలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలతోపాటు బహుమతులు ప్రదానం చేశారు.

### 'రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి'

**ప్రజాశక్తి-గూడూరు టౌన్:** రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సునీల్ పేర్కొన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అనేక విధాల చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

## వెనువెంటనే మురుగును తొలగించండి: బడి

మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న బడి సుధాయాదవ్

**ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి):** మండలంలోని వెంకటంపేట గ్రామంలో మురికినీటి కాలువ సమస్యను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ఒబిసి ఫోరం కన్వీనర్ బడి సుధాయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండలంలోని రాయలపురం పంచాయతీ వెంకటంపేట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ పోరాట సమితి అధ్యక్షుడు బాదూరు ఎల్లయ్య అక్కడి మురుగు నీటి కాలువ వల్ల జరిగే అనర్థాలను గురించి ఆయనకు వివరించారు. బడి సుధాయాదవ్ మురికినీటి కాలువల దుస్థితిని పరిశీలించారు. వెంకటంపేట మరో ఉద్దానంలా గ్రామం తయారైందని, కిడ్నీ బాధిత మరణాలు, డయాలసిస్ రోగులకు సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో వెంకట సూర్యసాయిని కలిసి మురికినీటి కాలువ సమస్య పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బడి సుధాయాదవ్ మాట్లాడుతూ తాగునీటితో మురుగునీరు కలిసి కలుషితమై స్థానికులు రోగాలు బారిన పడుతున్నారని అన్నారు. తాజాగా ఇద్దరు కిడ్నీ సమస్యతో మరణించారని పేర్కొన్నారు. ఒక్కో మృతుని కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్గ్రేషియా ప్రకటించాలని, డయాలసిస్ రోగులకు రూ.5 లక్షలు వైద్య సాయం అందించాలని డిమాండ్ చేశారు. మురుగునీరు నిల్వ లేకుండా యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. 48 గంటల్లో పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా అధికారులను హెచ్చరించారు.

## 'టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం'

సభలో ప్రసంగిస్తున్న బొజ్జల సుధీర్రెడ్డి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు సముచిత స్థానం లభిస్తుందని అపార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్ఛార్జ్ బొజ్జల సుధీర్రెడ్డి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ భవన్లో గురువారం జయహో బీసీ మహాసభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీలను రాజ్యాధికారం దిశగా తీసుకెళ్లిన ఏకైక పార్టీ టిడిపి అని కొనియాడారు. మాజీ సీఎంలు ఎన్టీఆర్, నారా చంద్రబాబునాయుడు బీసీలకు 34శాతం రిజర్వేషన్లు అమలు చేసి చట్టసభల్లో బీసీల ప్రాధాన్యతను పెంచారంటూ గుర్తు చేశారు. అలాంటి బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ నాలుగేళ్లుగా వారిని అణగదొక్కేందుకే కుట్ర చేశాడని విమర్శించారు. మళ్ళీ టీడీపీకి అధికారంలోకి వస్తే తిరిగి బీసీలకు అన్ని రకాలుగా అండదండలు అందిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీసీ కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తామంటూ హామీ ఇచ్చారు. కుల వృత్తి దారుల వ్యాపారం నిమిత్తం శ్రీకాళహస్తి కేంద్రంగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తామని చెప్పారు. యాదవులకు గొర్రెలు, మేకల పెంపకంపై రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీసీలు టిడిపికి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. తుడా మాజీ ఛైర్మన్ నరసింహయాదవ్, దశరథాచారి, గురవారెడ్డి, ఉమేష్రావు, హరిబాబు, శ్రీనివాసులురెడ్డి, రవి, బుజ్జి, సుప్రజా తదితరులు పాల్గొన్నారు.

## రైల్లలో ప్రత్యేక నిఘా: డీఎస్పీ

రైల్వే స్టేషన్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** రైల్లలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు రైల్వే డీఎస్పీ షేక్ షాను తెలిపారు. గురువారం పుత్తూరు రైల్వే స్టేషన్ను డాగ్ టీంతో తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల బ్యాగులు వంటి వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు. రాబోవు ఎన్నికల దృష్ట్యా నిఘా ఉంచినట్లు ఆమె తెలిపారు. రసీదులేని వస్తువులు సీజ్ చేయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రతి రోజూ తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రేణిగుంట రైల్వే సిఐ దేవేంద్ర కుమార్, ఎస్ఐ రవికుమార్, ఎస్ఐ పెరుమాళ్, ఏఎస్ఐలు శేఖర్, కార్తికేయన్, స్టేషన్ మాస్టర్ పంకర్కుమార్ స్వామినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యతో దైవభక్తిని పెంపొందించుకోవాలి: పీఠాధిపతి

జ్ఞాపికను అందజేస్తున్న మోహన్బాబు

**ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి):** విద్యార్థులు విద్యతో దైవ భక్తిని పెంపొందించుకోవాలని కర్ణాటకకు చెందిన శ్రీ సంస్థాన్ గారకర పార్తగల జీవోత్తమ మఠ పీఠాధిపతి శ్రీమద్ విద్యాధిశ తీర్థ శ్రీపాద వడేర్ స్వామి కోరారు. గురువారం మండలంలోని ఏ.రంగంపేట వద్ద ఉన్న మోహన్ బాబు వర్సిటీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భగవంతుని అనుగ్రహం ఉంటే ఎంతటి పనినైనా సాధించవచ్చని పేర్కొన్నారు. శ్రీవారి పాదాల చెంతన విద్యావంతుడైన మోహన్బాబు విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం అందుకు నిదర్శనం అన్నారు. ఇక్కడ విద్యను అభ్యసించిన విద్యార్థులు ప్రపంచంలో పూజింపబడుతారని నమ్ముతున్నట్లు చెప్పారు. యూనివర్సిటీలో విద్యతో పాటు ఆధ్యాత్మికత ఉట్టిపడుతుందని ఆనందం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ ఛాన్సలర్ మోహన్బాబు మాట్లాడుతూ విద్యకు భక్తికి దగ్గర సంబంధం ఉందన్నారు. అనంతరం పీఠాధిపతి శ్రీమద్ విద్యాధిశ తీర్థ శ్రీపాదవడేర్ స్వామి దృశ్యాలువతో ఘనంగా సన్మానించి జ్ఞాపకను అందజేస్తారు. సమావేశంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ఆచార్య నాగరాజరామారావు, రిజిస్టర్ ఆచార్య సారథి తదితరులు పాల్గొన్నారు.

## వలస వెళ్లిన ఓటర్లను తొలగించండి

- ఆర్డీవోకు టీడీపీ వినతి

**ప్రజాశక్తి-పుత్తూరుటౌన్:** వలస వెళ్లిన ఓటర్లను తొలగించాలంటూ టీడీపీ నేతలు గురువారం ఆర్డీవోకు విన్నవించారు. పట్టణంలోని 41వార్డులోని 41వ పోలింగ్బూత్లో కొత్తగా నమోదు అయిన చెన్నై, తమిళనాడుకు, తిరుపతికి 25యేళ్ల క్రితం వలస వెళ్ళిన వారి ఓటర్లను, 5 యేళ్ల క్రితం పెళ్లి చేసుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓటర్లను తొలగించాలని కోరారు. అయితే ఇదే విషయమై తమ బిఎల్వో ఏలుమలై, బిఎల్ఓ తేజశ్రీకి గత నెల 5వ తేది కోరితే ఆ బిఎల్ఓ 11వ తేది పుత్తూరు పోలీసుస్టేషన్లో తమపై కేసు పెట్టారని, దారుణమని విచారం వ్యక్తం చేశారు. తమ బిఎల్ఓ ఎలుమలైరెడ్డి నిజంగా బిఎల్ఓని ఇబ్బంది పెట్టే వుంటే 6,7తేదీల్లో పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసివుండాలన్నారు. ఉద్దేశపూర్వకంగా తమ పార్టీ నాయకులుపై తప్పుడు కేసు నమోదు చేసి మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని టీడీపీ నాయకులు వాపోయారు. కార్యక్రమంలో నాయకులు జీవరత్నంనాయుడు, గణేష్, షణ్ముగరెడ్డి, యుగంధర్, ఆనంద్, ధనపాల్, రాధాఅశోక్, ఏలుమలైరెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

### గూడూరు తహశీల్దార్గా కరుణకుమార్

కరుణకుమార్

**ప్రజాశక్తి-గూడూరురూరల్:** గూడూరు తహశీల్దార్గా కరుణకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా దాచేపల్లి నుంచి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు.

### నాగలాపురానికి నరసింహులు

నరసింహులు

**ప్రజాశక్తి-నాగలాపురం:** మండల తహశీల్దార్ నరసింహులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కడప జిల్లా కె.వి పల్లి నుండి బదిలీపై వచ్చారు.

### వెంకటగిరికి సాంబశివరావు

**ప్రజాశక్తి-వెంకటగిరి రూరల్:** వెంకటగిరి మండల తహశీల్దార్గా గురువారం సాంబశివరావు బాధ్యతలు చేపట్టారు. ఈయన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ గ్రూప్-2 పరీక్షలు రాసి మొట్టమొదట 2009లో నెల్లూరు జిల్లా డక్కిలి మండల డిప్యూటీ తాహసిల్దార్గా నియమితులై అక్కడి నుంచి గుంటూరు తహశీల్దార్గా పని చేసి వెంకటగిరికి బదిలీపై వచ్చారు.

## వేపగుంట- అక్కేరి రోడ్డు సమస్య పరిష్కారం

- మంత్రి చొరవతో రైల్వే అధికారుల నుంచి స్పందన

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** రూరల్ మండలం వేపగుంట- అక్కేరి రోడ్డు సమస్యను పరిష్కరించడానికి గురువారం సంఘటనా స్థలాన్ని మంత్రి ఆర్కే రోజా సందర్శించారు. దక్షిణ రైల్వే అధికారులతో సమీక్షించారు. రైల్వే మరమ్మతు పనులతో అక్కేరి దళితవాడ ప్రజలకు రహదారి సమస్య తలెత్తింది. ప్రజల వినతులపై స్పందించిన మంత్రి అక్కడకు చేరుకొని రైల్వే అధికారులతో చర్చించారు. వేపగుంట నుంచి అక్కిరి దళితవాడ వరకు రోడ్డు, డ్రైనేజీ కాల్వ ఏర్పాటుకు స్థలం మినహాయించడానికి రైల్వే అధికారులు సానుకూలత వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించిన మంత్రికి స్థానికులు కృతఘ్నతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలమ్మ, వైస్ ఎంపీపీ మునస్వామి రెడ్డి, ఎంపీడీవో ప్రసాద్, నాయకులు లక్ష్మణ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### ఎర్రచందనం స్వాధీనం

స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం చూపుతున్న అధికారులు

**ప్రజాశక్తి-యర్రావారిపాళ్యం:** విలువైన ఎర్రచందనం స్వాధీనం చేసుకొని స్మగ్లర్ని అరెస్ట్ చేసినట్లు ఎఫ్ఆర్వో దత్తాత్రేయ తెలిపారు. గురువారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. తలకోన సెంట్రల్ బీట్ పరిధిలో బుధవారం కూంబింగ్ చేపట్టినట్లు చెప్పారు. దుంగలు మోస్తూ ఎదురుపడ్డ స్మగ్లర్లు తమను చూసి పారిపోయారన్నారు. ఈ క్రమంలో సిబ్బంది దాడి చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. సంఘటనా స్థలంలో 12దుంగలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. పట్టుబడ్డ వ్యక్తి తమిళనాడుకు చెందిన సుధాకర్ గోవిందరాజ్గా గుర్తించామన్నారు. ఈ మేరకు అతన్ని రిమాండుకు పంపినట్లు చెప్పారు. ఈ దాడిలో ఎఫ్ఎస్ఓ సలావుద్దీన్, ఎఫ్బిఓలు ప్రదీప్ చాంద్, రాజేష్, లక్ష్మీ ప్రసాద్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

### అభినందన

సుధాకరయ్యను అభినందిస్తున్న వీసీ

**ప్రజాశక్తి-క్యాంపస్:** ఎడిఎక్స్యా రీసెర్చ్ యూనివర్సిటీ అమెరికా, రీసర్చ్ సెంటర్ ఇండియా వారితో కలిసి డాక్టర్ సుధాకరయ్య ఒక బుక్ వాల్యూమ్ను ప్రచురించిన సందర్భంగా ఎస్వీయూలోని డాక్టర్ సుధాకరయ్యను విసి శ్రీకాంత్ రెడ్డి గురువారం విసి చాంబర్లో అభినందించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ గణిత విభాగం ఆచార్యులు డాక్టర్ సుధాకరయ్య విదేశీ పరిశోధన సంస్థలతో కలిసి "ది ఫ్యూచర్ ఆఫ్ వరల్డ్ రీసెర్చ్ వాల్యూం వన్" పుస్తకాన్ని ప్రచురించడం అభినందనీయమన్నారు. ఇతర అధ్యాపకులు కూడా ఇదే విధంగా స్ఫూర్తిని పొంది విదేశీ సంస్థలతో, జాతీయస్థాయి పరిశోధనా సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటూ వినూత్నమైన పరిశోధన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇందుకు గాను డాక్టర్ సుధాకరయ్యకు పరిశోధన సంస్థ ఎడిటర్గా అవకాశం కల్పించడం వర్సిటీకి గర్వకారణమన్నారు.

### 'డి వార్మింగ్ డే విజయవంతం చేయండి'

**ప్రజాశక్తి-తడ:** జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో మల్లికార్జునరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కాగా ఈ కార్యక్రమం ద్వారా ఉచితంగా అల్బెండోజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

### సంక్షేమం,అభివృద్దే లక్ష్యంగా సేవ చేస్తా..: చెవిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మోహిత్ రెడ్డి

**ప్రజాశక్తి-రామచంద్రాపురం:** సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా ప్రజా సేవ చేస్తానని తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వివిద గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభోత్సవం చేసి, పార్టీ జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలే తన కుటుంబంగా భావించి సేవ చేస్తున్నానని మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు నిరంతరంగా అందుబాటులోకి ఉంటూ ప్రజాసేవకు అంకితం అవుతానని తెలిపారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి విచ్చేసిన మోహిత్రెడ్డికి బోడిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో యువత ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పిటిసి ఢిల్లీ భానుకుమార్ రెడ్డి, పార్టీ కన్వీనర్ చంద్రశేఖర్రెడ్డి, మురుగయ్య, సర్పంచులు విమాల్రెడ్డి, గోవర్ధన్యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**హామీలు నెరవేర్చలేదు..**

ప్రజా సంకల్ప యాత్రలో జగన్ అనుపల్లిలో డీకేటీ భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని, సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించాలని వైసీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాటూరు నాదముని మోహిత్ రెడ్డిని కోరారు.

### టాటా ఏఐఏ సీఈఓగా వెంకటాచలం

**ప్రజాశక్తి-తిరుపతి సిటీ:**

ప్రముఖ జీవిత బీమా కంపెనీలలో ఒకటైన టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్కి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్గా హెచ్.వెంకటాచలం నియమితు లయ్యారు. ప్రస్తుత చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్, నవీన్ తహిల్యాని నుంచి వెంకటాచలం బాధ్యతలు స్వీకరించారు. అందరూ అభిమానంగా వెంకీ అని పిలిచే వెంకటాచలంకి లైఫ్ ఇన్సూరెన్స్, అసెట్ మేనేజ్మెంట్, కస్టోడియల్ సర్వీసెస్లో 27 సం వత్సరాల అనుభవం ఉంది. అతను సేల్స్, డిస్ట్రిబ్యూషన్, స్ట్రాటజీ, బిజి నెస్, ప్రాసెస్ డెవలప్మెంట్, కీ అకౌంట్ మేనేజ్మెంట్లో ఎంతో నైపు ణ్యం సంపాదించారు. ఆయన 2016లో టాటా ఏఐఏలో చేరారు. ఆయన ఈ బాధ్యతలు చేపట్టక మునుపు ప్రెసిడెంట్, చీఫ్ డిస్ట్రి బ్యూషన్ ఆఫీసర్గా ఉన్నారు. మార్కెటింగ్, స్ట్రాటజీ, అనలిటిక్స్ డైరెక్ట్ డిజిటల్ బిజినెస్ వంటి రంగాలలో వెంకీ అనేక కార్యక్రమాలకు నాయ కత్వం వహించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటాచలంను ఆ సంస్థకు చెందిన అధికారులు ఉద్యోగులు అభినందించారు.

### 'నాని'ని ఎమ్మెల్యేగా గెలిపించండి: సుధారెడ్డి

**ప్రజాశక్తి-రామచంద్రాపురం:**

పులివర్తి నానిని చంద్రగిరి ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇచ్చి గెలిపించాలని పులివర్తి సుధారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. గురువారం పాకాల మండలంలోని దామలచెరువు పంచాయతీలో 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి' కార్యక్రమం ద్వారా ప్రచారం చేపట్టారు. వచ్చే ఎన్నికల్లో నానిని గెలిపిస్తే చంద్రగిరి అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఆమె అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా రామచంద్రాపురం మండలంలోని ఎన్ఆర్ కమ్మపల్లె పంచాయతీలో పులివర్తి వినీల్ ప్రచారం నిర్వహించారు. పులివర్తి నానిని ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. నాయకులు తిరుమలరెడ్డి, జెడి జగన్, సోమురాయల్, వెంకటేష్నాయుడు, గుణమ్మ, గిరిధర్రెడ్డి, రవికుమార్, సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలను అరికట్టాలి: సీడీపీవో

**ప్రజాశక్తి-కేవిబి పురం:**

బాల వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీవో శోభారాణి అన్నారు. గురువారం బాల్య వివాహాలు వలన కలిగే అనర్థాలపై కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సిడిపిఓ శోభారాణి మాట్లాడుతూ చిన్న వయసులో వివాహలు చేయడం వలన మానసికంగా, శారీరకం ఎదురయ్యే సమస్యలను అర్థవంతంగా వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ సునీల్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. పరిసరాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే 1908 లేదా 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటకృష్ణయ్య, అంగన్వాడి టీచర్ మునేశ్వరి, ఏఎన్ఎం, విద్యార్థినులు పాల్గొన్నారు.

**నాగలాపురం:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఐసీడీఎస్ సూపర్వైజర్ శ్రీదేవీ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఓబయ్య పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అరుణ్కిషోర్, ఎస్ఐ రవి, హెచ్ఎం కస్తూరయ్య, ఏఎన్ఎం భార్గవి తదితరులు పాల్గొన్నారు.

### నిమ్మసాగుపై అవగాహన

**ప్రజాశక్తి-తిరుపతి డెస్క్:** మండలంలోని కానూరు రాజుపాలెం ఆర్బీకేలో గురువారం నాయుడుపేట ఉద్యానవన అధికారి శారద ఆధ్వర్యంలో రైతులకు నిమ్మసాగుపై అవగాహన కల్పించారు. అనంతరం తోటలను పరిశీలించి సాగు పద్ధతులు, చీడపీడల నివారణ చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అసిస్టెంట్ శ్రీరాములు, రైతులు పాల్గొన్నారు.

### వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి: ఎంఆర్పీఎస్

**ప్రజాశక్తి-రామచంద్రాపురం:** ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన చట్టబద్ధత కల్పించాలని రాష్ట్ర ఎంఆర్పీఎస్ కార్యదర్శి వెంకటపతి మాదిగ గురువారం ఒక పర్యటనలో డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉపకులాల జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి సమన్యాయం, సామాజిక న్యాయం చేకూర్చాలని కోరారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల జనాభా మేరకు విద్య ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించకపోవడంతో కులాల మధ్య అంతర్గత అసమానతలు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### డయాలసిస్ సెంటర్కు వీల్ చైర్ వితరణ

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిర్వహిస్తున్న డయాలసిస్ కేంద్రానికి పసుపులేటి కుటుంబం గురువారం వీల్ చైర్ వితరణ చేశారు. పసుపులేటి వెంకటేశ్వర్లు జ్ఞాప కార్థం వారి కుటుంబ సభ్యులు రూ.10వేలు విలువచేసే వీల్చైర్ను డయాలసిస్ రోగుల కోసం అందజేయడం జరిగింది. కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నవీన్ కుమార్, అనిల్కుమార్, కంటా సుబ్బు, గిరి, కళ్యాణి, మౌనిక పాల్గొన్నారు.

### ఆశా వర్కర్ల నిర్బంధం అన్యాయం

**ప్రజాశక్తి-కేవిబి పురం:** ఆశా వర్కర్లను నిర్భందించడం అన్యాయమని సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 'చలో విజయవాడ'కు ఆశా వర్కర్ల కార్యక్రమానికి బుధవారం వెళుతుండగా గూడూరు పోలీసులు వారిని అరెస్ట్ చేయడం దారుణమని మండిపడ్డారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయకపోతే పెద్దఎత్తున ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. వీటన్నిటికీ త్వరలోనే ప్రజలు సీఎం జగన్మోహన్రెడ్డికి మంచి గుణపాటాన్ని నేర్పుతారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

### నవోదయ మోడల్ పరీక్షకు విశేష స్పందన

**ప్రజాశక్తి-క్యాంపస్:** తిరుపతి వరదరాజనగర్లోని విశ్వం పాఠశాలలో నిర్వహించిన నవోదయ మోడల్ పరీక్షకు విశేష స్పందన వచ్చిందని విద్యా సంస్థల అధినేత డాక్టర్ విశ్వనాథరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వివిద ప్రాంతాల నుంచి 256మంది విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్కి హాజరైయ్యారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఈ నెల 10న జరగనున్న ప్రవేశ పరీక్షకు అనుగుణంగా ఈ ఉచిత నమూనా పరీక్షను నిర్వహించామన్నారు. దీని ద్వారా రేపు రాయబోయే ప్రవేశ పరీక్ష సులభంగా రాయడమేగాక, ఆత్మస్తైర్యాని పెంపొందించి, మంచి ర్యాంకు సాధించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి, కరస్పాండెంట్ తులసి, విశ్వనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాలు పరిశీలన

**ప్రజాశక్తి-బాలయపల్లి:** మండలంలోని వివిద పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ మహబూబ్ సుభాన్ గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 75 పోలింగ్ కేంద్రాలు ఉండగా అని సౌకర్యాలు ఉండేలా అధికార ులను సమన్వయం చేసుకుంటున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందో బస్తు ఏర్పాట్లు, నిఘాకు అవసరమైన ఏర్పాట్లకు సన్నద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు.

### నేడు సీపీఎం ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా నిరసన

**ప్రజాశక్తి-ఓజిలి:** మాచవరం రైతులకు వారి భూములు సాగు చేసుకునేటకు అవకాశం కల్పించాలని సిపిఎం నాయకులు శివకవి ముకుంద పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓజిలి మండలం మాచవరం గ్రామంలో సర్వే నెంబర్లలో 207, 263లో 60మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సాగు పట్టాలు ఇచ్చారన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వీరు ఆ భూముల్లో నిమ్మ చెట్లు సాగు చేసుకుంటున్నారని ఇటీవల ఆ భూములలో రైతులు సాగు చేయడం లేదంటూ, విలువైన భూములను పరిశ్రమలకు కట్టబెట్టేందుకు గత కొన్ని నెలల క్రితం రెవెన్యూ అధికారులు పోలీసు బలగాలతో వచ్చి నిమ్మచెట్లను తొలగించి తమ ఉత్సాహాన్ని ప్రదర్శించారని మండిపడ్డారు. దీనిపై రైతులకు మద్దతుగా శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, సిపిఎం నాయకులు, ప్రజా సంఘ నాయకులు, దళిత సంఘ నాయకులు ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా నిరసనలు చేపడుతున్నామని తెలిపారు.

### చట్ట వ్యతిరేక చర్యలపై ఉక్కుపాదం

**ప్రజాశక్తి-ఓజిలి:** చట్ట వ్యతిరేక చర్యలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్ఐ రవిబాబు హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న సుమారు 12మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశామన్నారు. ముఖ్యంగా మద్యం షాపుల సమీపంలో రోడ్లపైన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నారన్నారు. ఆయా ప్రదేశాలపై నిఘా ఉంచామన్నారు.

### సస్యరక్షణతో అధిక లాభాలు

**ప్రజాశక్తి-బాలాయపల్లి:**

పుచ్చకాయ సాగులో సస్యరక్షణ చర్యలు అవసరమని ఉద్యానశాఖ అధికారి ఆనంద్రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలో వివిద చోట్ల పంటలను ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. పంట సాగు పద్ధతులను వివరించారు. ఇతర సలహాలు కావలసిన రైతులు 7995009767 సంప్రదించాలని సూచించారు.

### 'టీడీపీని గెలిపించండి'

**ప్రజాశక్తి-చిట్టమూరు:**

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలిపించాలని ఆ పార్టీ నాయకులు గురువారం మండలంలో ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఎల్లసిరి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు కిషోర్నాయుడు, జనార్దన్రెడ్డి, రాజేష్రెడ్డి, చెంచురామాచారి, నరేష్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.